గురువారం,
ఆగస్టు 12, 2026

తెలంగాణ
దైలి న్యూస్ ప్రజల గుండె చప్పుడు



# జిల్లాలో విచ్చలవిడిగా విషతుల్యమైన కల్లు విక్రయాలు

- ఒకే అనుమతి.. బహుళ విక్రయ కేంద్రాలు..
- పుట్టగొడుగుల్లా అక్రమ కల్లు డిపోలు
- పాణాలు పోయాకే స్పందిస్తారా..
- అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల తీవ్ర ఆగ్రహం..



?వికారాబాద్, ఆగస్టు 13 ( తెలంగాణ డైలి న్యూస్ ) : పల్లెల్లో ఏరులై పారుతున్న కల్తీ కల్లు, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ అక్రమార్కులు సాగిస్తున్న ఈ దందాకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ఎలాంటి భయమూ లేకుండా గ్రామీణ ప్రాంతాలకు కల్తీ కల్లును సీసాల్లో నింపి బహిరంగంగానే సప్లై చేస్తున్నారు. అసలు ఆ కల్లులో ఎలాంటి రసాయనాలు కలుపుతున్నారు? ఏ నీళ్లు వాడుతున్నారు? అనేది ఎవరికీ అర్థం కాని ప్రశ్నగా మారింది. నాణ్యతా ప్రమాణాలు లేకపోవడమే కాకుండా, స్వచ్ఛమైన కల్లు పేరుతో ప్రజల ముక్కుపిండి మరీ ప్రాణాంతకమైన విషాన్ని విక్రయిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ?వికారాబాద్ జిల్లాలోని పలు మండలాలు, గ్రామీణ ప్రాంతాల సరిహద్దుల్లో అక్రమ కల్లు తయారీ డిపోలు పుట్టగొడుగుల్లా వెలిసాయి. ఎలాంటి అనుమతులు, నాణ్యతా ప్రమాణాలు లేకపోయినా యథేచ్ఛగా నకిలీ కల్లును తయారు చేస్తూ ఏజెన్సీల పేరుతో నిత్యం గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. కల్లు శాంపిళ్లను క్రమం తప్పకుండా సేకరించి ల్యాబ్‌లకు పంపాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులకు ఇవన్నీ కనిపించడం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గ్రామీణులకు చేరేసరికి ఆ కల్లు సీసాలు పూర్తిగా కలుషితమై ఉంటున్నాయి. దీన్ని తాగిన అనేకమంది పక్షవాతం, కాలేయ వ్యాధులు, కంటి చూపు మందగించడం వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యల బారిన పడుతూ ఆసుపత్రుల పాలవుతున్నారు.

**ఒకే అనుమతి.. బహుళ విక్రయ కేంద్రాలు..**

జిల్లాలో అనుమతి ఉన్నది ఒక్క చోటైతే, అదే లైసెన్స్ బోర్డులు, కాగితాలు చూపిస్తూ చుట్టుపక్కల గ్రామాల్లో మరో రెండు మూడు చోట్ల అక్రమ డిపోలు, పాయింట్లను ఏర్పాటు చేశారు. అసలు అక్కడ సరఫరా అవుతున్న కల్లు ఏ చెట్టు నుండి తీసింది అందులో ఏ రసాయనాలు, ఏ నీళ్లు కలుపుతు న్నారు.? అన్నది ఎవరికీ తెలియదు. ఒక్క లైసెన్స్‌తో వేల లీటర్ల నకిలీ కల్లును తయారు చేస్తూ అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నాణ్యతా ప్రమాణాలను తనిఖీ చేయాల్సిన ఎక్సైజ్ అధికారులు మాత్రం ఈ సమాచారం తెలిసినా కనీసం కన్ను ఎత్తి చూడకపోవడం గమనార్హం.

**అక్రమ తయారీ డిపోలు.. ఎవరు అడిగే దిక్కులేదు**

జిల్లాలోని పలు ప్రాంతాల్లో అక్రమ కల్లు తయారీ డిపోలు వెలిసాయి. ఎలాంటి అనుమతులు లేకపోయినా, యథేచ్ఛగా నకిలీ కల్లును తయారు చేస్తూ ఏజెన్సీల పేరుతో గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. కల్లు శాంపిళ్లను పరిశీలించాల్సిన ఎక్సైజ్ శాఖ, సకాలంలో చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. గ్రామాలకు చేరుతున్న కల్లు సీసాలు పూర్తి స్థాయిలో కలుషితమై ఉంటున్నాయని, వీటిని తాగిన వారు రకరకాల ఆరోగ్య సమస్యల బారిన పడుతున్నారని ప్రజలు వాపోతున్నారు.

**తూతూమంత్రంగా తనిఖీలు.. కేసులు ఎక్కడ**

అధికారులు తనిఖీల పేరుతో కేవలం కంటి తుడుపు చర్యలకే పరిమితమవుతు న్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏదో ఒక చోట తూతూ మంత్రంగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప, ఈ అక్రమ దందాకు మూలమైన పెద్దలను, తయారీ డిపోలను గుప్పెట్లో ఉంచుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారు. తనిఖీలు సైతం నామమాత్రంగానే సాగుతున్నాయని, మామూళ్ల మత్తులో అధికారులు జోగుతున్నారా అనే అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

**ప్రాణం పోయాకే స్పందిస్తారా**

ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి, ప్రాణాలు పోతేనే అధికారులు అప్రమత్తమవుతారు.. లేకపోతే పట్టించుకోరు" అంటూ జిల్లా ప్రజలు అధికారుల తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నారు. ప్రమాదం జరిగాక పరిహారాలు ప్రకటించడం, హడావుడి చేయడం కాదని, ముందే కల్తీ దందాను అరికట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యపు వైఖరిపై అన్ని వర్గాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, వికారాబాద్‌ను కల్తీ కల్లు రహిత జిల్లాగా మార్చడానికి జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేపట్టి, కల్తీ రాయుళ్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయా లని స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# పాఠశాల విద్యార్థులకు ఉచిత దుస్తుల పంపిణీ



కులకచర్ల, ఆగస్టు 13 ( తెలంగాణ డైలి న్యూస్ ) : వికారాబాద్ జిల్లా కులకచర్ల మండలం కుస్మసముద్రం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత దుస్తుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ గందె ప్రవీణ్ కుమార్ విద్యార్థులకు దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయు లు శ్రీనివాస్, ఉప సర్పంచ్ గుడిసె పద్మ కృష్ణయ్య, వార్డు సభ్యులు మోతుకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం అందిస్తున్న ఈ అవకాశాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మహిళా సంఘాల ప్రతినిధులు, పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గండీడ్ మండలంలో హర్ ఘర్ తిరంగా భారీ ర్యాలీ



గండిడ్, ఆగస్టు 13 ( తెలంగాణ డైలి న్యూస్ ) : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు చేపట్టిన "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమంలో భాగంగా బీజేపీ గండేడ్ మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వెన్నచేడ్ నుండి సల్కర్‌పేట్ వరకు భారీ తిరంగా ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. సుమారు 80 ట్రాక్టర్లతో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని దేశభక్తి స్ఫూర్తిని చాటారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా బీజేపీ వికారా బాద్ మాజీ జిల్లా అధ్యక్షుడు కరణం ప్రహ్లాద్ రావు, జిల్లా అధ్యక్షుడు యు. రమేష్ కుమార్, బీజేపీ పరిగి అసెంబ్లీ ఇంచార్జ్ మారుతి కిరణ్ బూనేటి, బీజేపీ నాయకుడు వెన్న ఈశ్వరప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా మారుతి కిరణ్ బూనేటి మాట్లాడుతూ, "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమం ప్రతి భారతీయుడిలో దేశభక్తి స్ఫూర్తిని నింపే గొప్ప కార్యక్రమని పేర్కొన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి గౌరవించాల్సిందిగా పిలుపు నిచ్చారు. దేశ అభివృద్ధిలో రైతుల పాత్ర కీలకమని, రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ?80 ట్రాక్టర్లతో రైతులు భారీగా తరలిరావడంతో ర్యాలీ దేశభక్తి నినాదాలతో ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గిరమోని శ్రీనివాస్, ఏవి. రాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శంకర్ నాయక్, మోత్కూర్ గ్రామ మాజీ సర్పంచ్ కేశవులు, బీజేపీ పరిగి అసెంబ్లీ కన్వీనర్ ఉగ్ర నరసింహ, ఓబీసీ మోర్చా మాజీ అధ్యక్షుడు యాదయ్య, పరిగి అసెంబ్లీ ఓబీసీ మోర్చా కన్వీనర్ విజయ్, వికారాబాద్ జిల్లా ధార్మిక సెల్ జాయింట్ కన్వీనర్ జాక సురేష్ బాబు, చౌడపూర్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, దోమ మండల అధ్యక్షుడు మల్లేష్, కుల్కచర్ల మండల అధ్యక్షుడు గుడాల వెంకటేష్, మహమ్మదాబాద్ మండల అధ్యక్షుడు నర్సింలు, గండేడ్ మండల మాజీ అధ్యక్షుడు ప్రభు నాయక్, మహమ్మదాబాద్ మండల మాజీ అధ్యక్షుడు కురువ కృష్ణ, జిల్లా మీడియా కన్వీనర్ కంకల్ రవీందర్, బీజేవైఎం అసెంబ్లీ కో-కన్వీనర్ మనోహర్ గౌడ్, ఇతర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అప్రమత్తతే సైబర్ నేరాల నివారణకు తొలి రక్షణ

- ఆన్‌లైన్ లావాదేవీల్లో జాగ్రత్త వహించాలి
- విద్యార్థులకు అవగాహన కల్పించిన పరిగి డీఎస్పీ శ్రీనివాసులు







కుల్కచర్ల, ఆగస్టు 13 ( తెలంగాణ డైలి న్యూస్ ) : సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న కొద్దీ సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, వీటి పట్ల ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పరిగి డీఎస్పీ ఎన్. శ్రీనివాసులు సూచించారు. 'సైబర్ క్రైమ్ జాగృత దివస్' పురస్కరించుకుని బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికలు)లో సైబర్ నేరాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ శ్రీనివాసులుతో పాటు పరిగి సీఐ కె. కొండల్ రెడ్డి, కుల్కచర్ల ఎస్ఐ రమేష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఆన్?లైన్ యాప్స్, సామాజిక మాధ్యమాలు మరియు డిజిటల్ చెల్లింపులు చేసే సమయంలో ప్రతీ ఒక్కరూ ఆలోచించి అడుగు వేయాలని పిలుపునిచ్చారు.

**ప్రధానంగా ఎదురయ్యే మోసాల పద్ధతులు**

బ్యాంకు అధికారులు లేదా ప్రభుత్వ అధికారుల పేరుతో ఫోన్లు చేసి ఓటీపీ, సీవీవీ, యూపీఐ పిన్ అడిగితే చెప్పవద్దని తెలిపారు. అలాగే తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తామనే నకిలీ యాప్స్, ఉచిత బహుమతులు, ఉద్యోగ ప్రకటనలు చూసి లింకులపై క్లిక్ చేయవద్దని హెచ్చరించారు. ఇటీవల కాలంలో భయభ్రాంతులకు గురిచేస్తూ సాగుతున్న "డిజిటల్ అరెస్ట్" మోసాలపై స్పందిస్తూ, దేశంలో ఆన్?లైన్‌లో నిర్బంధించి డబ్బులు వసూలు చేసే విధానం లేదని స్పష్టం చేశారు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

ప్రతీ ఒక్కరూ ఖాతాలకు బలమైన పాస్?వర్డ్స్, రెండు అంచెల భద్రతా విధానాన్ని (టూ-ఫ్యాక్టర్ అథెంటికేషన్) ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఒకవేళ సైబర్ మోసానికి గురైతే వెంటనే ఆలస్యం చేయకుండా 1930 ఉచిత హెల్ప్‌లైన్ నంబరుకు ఫిర్యాదు చేయా లని, అలాగే మోసానికి సంబంధించిన ఆధా రాలైన స్క్రీన్ షాట్లు, లావాదేవీల ఐడీలను భద్రపరుచుకోవాలని తెలిపారు. ఈ కార్య్ర కమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు, నర్సింలు గౌడ్, పోలీసు సిబ్బంది సుమారు 140 మంది విద్యార్థినులు పాల్గొన్నారు.

# భూమి ఆక్రమణకు నిరసనగా 17న ఎస్పీ కార్యాలయం ముట్టడి



- వాలు పోస్టర్ ఆవిష్కరించిన ప్రజాసంఘాల నాయకులు

తాండూరు, ఆగస్టు 13 ( తెలంగాణ డైలి న్యూస్ ) : సోమన్ గుర్తి గ్రామానికి చెందిన దళితుడు నర్సిములుకు చెందిన 30 గుంటల భూమిని ఏసీఈ టైర్స్ యాజమాన్యం అక్రమంగా ఆక్రమించిందని, సదరు యాజమాన్యానికి కొమ్ము కాస్తూ బాధితుడిపైనే అక్రమ కేసులు బనాయించిన చన్ గోముల్ ఉప తనిఖీ అధికారి (ఎస్సై) భరత్ కుమార్ రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ అక్రమాలు, పోలీసుల ఏకపక్ష వైఖరికి నిరసనగా ఈ నెల 17వ తేదీన వికారాబాద్ జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు ప్రకటించారు. బుధవారం తాండూరు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ప్రాంగణంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ముట్టడి కార్యక్రమానికి సంబందించిన ప్రచార పత్రాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సివిల్ వివాదాలలో నిబంధనలకు విరుద్ధంగా జోక్యం చేసుకుంటూ, కనీస భూ సరిహద్దుల పరిజ్ఞానం లేకుండా బాధిత దళితుడిపైనే తప్పుడు కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. బాధితుడి భూమిలో కంపెనీ వారు సరిహద్దు రాళ్ళు పాతడానికి, ఆక్రమణకు సదరు అధికారి ప్రత్యక్షంగా సహకరించారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. నర్సిములు భూమి నుంచి కంపెనీ ఆక్రమణలను వెంటనే తొలగించాలని, దళితుడిపై పెట్టిన అక్రమ కేసులను రద్దు చేయడంతో పాటు భూమిని ఆక్రమించిన కంపెనీ యాజమాన్యంపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని వారు స్పష్టం చేశారు. అక్రమాలకు సహకరించిన ఎస్సైపై తక్షణమే సస్పెన్షన్ వేటు వేయాలని, లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సీఐటీ యూ, కేవీపీఎస్, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం, జిల్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హక్కుల పోరాట సమితి వికారా బాద్ జిల్లా కమిటీల ప్రతినిధులు, బాధ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తాండూరులో భారీగా పట్టుబడిన గంజాయి

- రైలులో ఒరిస్సా నుంచి తాండూరుకు అక్రమ రవాణా..
- ఎక్సైజ్ దాడుల్లో ముగ్గురు గంజాయి కొరియర్లు అరెస్ట్..
- 13.5 లక్షల విలువైన 52.8 కిలోల ఎండు గంజాయి స్వాధీనం



తాండూర్, ఆగస్టు 13 ( తెలంగాణ డైలి న్యూస్ ) : ఒరిస్సా నుంచి రైలు మార్గంలో తాండూరుకు భారీగా తరలిస్తున్న ఎండు గంజాయిని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో దాడులు నిర్వహించి 52.8 కిలోల ఎండు గంజాయిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు తెలిపిన వివరాల ప్రకారం ఒరిస్సా ప్రాంతం నుండి తాండూరు వయా రైలు మార్గంలో గంజాయి స్మగ్లింగ్ జరుగుతుందన్న సమాచారంతో ఎక్సైజ్ డైరెక్టర్ మహంతి ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఎస్టీఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, డిటిఎఫ్, విభాగాలు సంయుక్తంగా రవాణాపై నిఘా పెట్టాయి. వికారాబాద్ జిల్లా తాండూరు రైల్వే స్టేషన్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, నాలుగు సూట్‌కేసుల్లో ప్యాక్ చేసి ఉన్న 36 ప్యాకెట్ల ఎండు గంజాయి లభ్యమైంది. స్వాధీనం చేసుకున్న గంజాయి బరువు 52.8 కిలోలు ఉండగా, దీని విలువ సుమారు 13.5 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

గంజా యిని రవాణా చేస్తున్న ముగ్గురు కొరియర్లను అధికారులు అరెస్ట్ చేసి, వారిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. అనం తరం నిందితులను రిమాండ్‌కు తరలించి నట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీని వాసరెడ్డి, స్థానిక సీఐతో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు.

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపు తామని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.

